

కానిస్టేబుళ్లకు పదోన్నతి

కరీంనగర్ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న 17 మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతిని కల్పించారు. ఈ మేరకు డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జోన్‌లో పని చేస్తున్న మొత్తం 46 మందికి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి 22 మందికి అవకాశం లభించింది. కరీంనగర్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న 17 మందికి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి రాగా వీరందరిని కామారెడ్డి, మెదక్‌కు బదిలీ చేశారు.

Central Equipment Identity Register (CEIR)

పోయిన ఫోన్‌ను పట్టేద్దాం..

● సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదుతో ఎక్కడున్నా కనిపెట్టవచ్చు
● కమిషనరేట్ వ్యాప్తంగా 1,627 సెల్‌ఫోన్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో సెల్‌ఫోన్ కీలకమైంది. 90 శాతం కొనుగోళ్లు ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. అన్ని రకాల చెల్లింపులకు ఫోనే ఆధారంగా మారింది. ఫోన్ ఎక్కడైనా పోతే, ఎవరైనా దొంగిలిస్తే ఆ ఫోన్‌లో భద్రపరిచిన విలువైన వ్యక్తిగత సమాచారం, ఇతర డేటా కోసం తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గతంలో సెల్‌ఫోన్ పోతే.. దాన్ని తిరిగి పొందేందుకు పోలీసులకు, మీసేవలో దరఖాస్తు చేసేందుకు ఇబ్బందులు పడుతుండేవారు. అయినప్పటికీ ఆ ఫోన్ లభిస్తుందో లేదో గ్యారంటీ లేకపోయేది. 2023 ఏప్రిల్ నుంచి కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఈఐఆర్ ప్రత్యేక అప్లికేషన్ ద్వారా సెల్‌ఫోన్ ఎక్కడ ఉందో సులభంగా గుర్తించవచ్చు. ఈ పోర్టల్ ద్వారా కరీంనగర్ కమిషనరేట్‌లో ఇప్పటి వరకు వెయ్యి వరకు సెల్‌ఫోన్‌లను పోలీసులు వెతికిపట్టుకుని యజమానులకు అప్పగించారు. పోగొట్టుకున్న, చోరీ అయిన వేల సెల్‌ఫోన్లను ఈ పోర్టల్ ద్వారా పోలీసులు బ్లాక్ చేశారు.

● ఫోన్ బ్లాక్

కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్ మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా పోయిన ఫోన్‌ను ఐఎంఈఐ నంబర్ సాయంతో బ్లాక్ చేయవచ్చు. ఆ తరువాత నుంచి ఆ సెల్‌ఫోన్ ఎట్టి పరిస్థితుల్లో పనిచేయదు. ఫోన్ ఆన్‌చేసి అందులో సిమ్ తీసి కొత్త సిమ్ వేసినా ఆ విషయం ఫోన్ యజమానికి, పోలీసులకు వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా తెలిసిపోతుంది.

● ఎలా పని చేస్తుంది..?

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌ను ఓపెన్ చేయాలి. అందులో బ్లాక్ ఫోన్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. మొబైల్ నంబర్-1, మొబైల్ నంబర్-2 ఫోన్ బ్రాండ్, మోడల్, ఇన్వాయిస్(బిల్)ఫొటో సూచించిన గడుల్లో సమాచారాన్ని పూర్తిగా నింపాలి. పోగొట్టుకున్న స్థలం, పోయిన తేదీ, ఇతర చిరునామాలు, అంతకుముందే ఇచ్చిన పోలీస్ ఫిర్యాదు నంబర్, ఫోన్ యజమాని చిరునామా, ఈ మెయిల్ ఐడీ, ధ్రువీకరణ కార్డులు, చాప్టర్లను సూచించిన బాక్సుల్లో పూరించాలి. వెంటనే సెల్‌ఫోన్ పాత నంబర్‌పై తీసుకున్న కొత్త సిమ్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసిన తర్వాత ఫామ్‌ను సబ్‌మిట్ చేయాలి. ఆ తర్వాత ఫోన్ దానంతట అదే బ్లాక్ అవుతుంది. ఇకపై దాన్ని ఎవరూ ఆపరేట్ చేయలేరు. డేటా సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ ఫోన్ దొంగిలించిన వ్యక్తి లేదా సెకండ్ హ్యాండ్‌లో కొన్న వ్యక్తి సిమ్ వేయగానే మీ నంబర్‌కు రిక్వెస్ట్ ఐడీ మెసేజ్ వస్తుంది. ఆ సందేశం ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉన్నా పట్టుకోవడం సులభతరం అవుతుంది.

● అన్‌బ్లాక్ చేసే విధానం..

పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు పట్టుకున్నా.. లేక దొరికినా.. పాత ఐడీ, ఫోన్ నంబర్, ఇతర వివరాలు నింపిన తర్వాత ఫోన్‌ను అన్‌బ్లాక్ చేసుకోవచ్చు. సెకండ్ హ్యాండ్ ఫోన్ కొన్నప్పుడు అది దొంగిలించిందా లేదా బ్లాక్‌లిస్టులో ఉందా? అనే విషయం మనం కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు. ఇందుకోసం మొబైల్ తీసుకుని కేవైఎం విధానంలోనూ ఐఎంఈఐ నంబర్‌ను తెలుసుకోవచ్చు. అందుకోసం కేవైఎం అని పెద్ద అక్షరాల్లో టైప్ చేయాలి.

అనంతరం 15 అక్షరాల ఐఎంఈఐ నం బర్‌ను టైప్ చేసి 14422 నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపాలి. ఇందుకోసం కేవైఎం యాప్‌ను సైతం డౌన్‌లోడ్ చేసు కోవచ్చు. ఇది ఆండ్రాయిడ్, ఐఓఎస్ మొబైల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంటుంది. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోనూ ఆఖరిగా ఇచ్చిన ఆప్షన్ ద్వారా కూడా ఫోన్‌ను తనిఖీ చేసుకోవచ్చు.

ఐఎంఈఐ నంబర్ తెలియకపోతే..

పోగొట్టుకున్న ఐఎంఈఐ నంబర్ తెలియకపోయినా, గుర్తు లేకపోయినా దాన్ని తెలుసుకోవచ్చు. మొబైల్ నుంచి *#06# డయల్ చేయగానే మీ మొబైల్ నంబర్‌పై దాని ఐఎంఈఐ నంబర్ ప్రత్యక్షమవుతుంది. ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే ఫోన్ కొనుగోలు చేసిన బాక్స్‌పై లేదా కొనుగోలు చేసిన షాపులో ఉన్న

మిగతా 8వ పేజీలో..





చిగురిస్తున్న ఆశలు

● గర్షకుర్తిలో స్వశక్తి చీరల తయారీ ● 28 లక్షల మీటర్ల ఆర్డర్లు

గంగాధర, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గర్షకుర్తిలో మరమగ్గాల చప్పుళ్లు మళ్లీ ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం స్వశక్తి చీరల తయారీకి ఆర్డర్లు జారీ చేసి నేత కార్మికులకు భరోసా కల్పించింది. గంగాధర మండలం గర్షకుర్తిలో మరమగ్గాలకు పెట్టింది పేరు. ఇక్కడ 14 వందల మగ్గాలుండగా రెండు వేల మంది ఉపాధి పొందుతున్నారు. సంవత్సర కాలంగా కార్మికులు ఉపాధి లేక, మరో పని చేయలేక ఇంటి పట్టునే ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తి మహిళలకు చీరలను అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గర్షకుర్తికి 28 లక్షల మీటర్ల గుడ్డ ఆర్డర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఆర్డర్లతో గ్రామంలోని మగ్గాల కార్మికులకు మూడు నెలల పాటు చేతినిండా పని ఉంటుంది. ప్రస్తుతం చేపట్టనున్న చీరల తయారీకి కార్మికుడికి తగిన ప్రతిఫలం అందించాలని కోరుతున్నారు.

గతంలో తయారు చేసిన చీరలతో పోల్చితే శ్రమతో కూడుకున్నదని అంటున్నారు. చీర తయారు చేసే క్రమంలో పోగులు తెగకుండా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. పోగు తెగితే అంటించడానికి సమయం పడుతుంది. దీంతో ఉత్పత్తి తగ్గి కార్మికుడికి కూలి తక్కువగా వచ్చే అవకాశం ఉంది. గతంలో కార్మికుడికి రోజుకు ఆరు వందల నుంచి తొమ్మిది వందల రూపాయల వరకు కూలి పడేది. ప్రస్తుతం పనికి తగ్గ ప్రతిఫలం అందించాలని గర్షకుర్తి కార్మికులు కోరుతున్నారు.

నేడు ప్రభుత్వానికి మోడల్ చీర అందజేత

రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంఘాల సభ్యులకు అందించనున్న చీరను గర్షకుర్తిలో తయారు చేసిన మోడల్‌ను శుక్రవారం ప్రభుత్వానికి అందజేయనున్నారు. గతంలో టెక్స్ ఉండగా ప్రస్తుతం టెక్స్, కాటన్ మిక్సింగ్‌తో తొమ్మిది గజాల చీరను అందించడానికి ప్రభత్వం అర్డర్లు ఇచ్చింది. దీని ప్రకారం గర్షకుర్తిలో యాజమానులు మోడల్ చీరను సిద్ధం చేశారు. శుక్రవారం మోడల్ చీరను టెక్స్‌టైల్ కార్పొరేషన్ కమిషనర్‌కు అందించనున్నారు. ఈ చీరకు ప్రభుత్వం ఆమోదం తెలిపితే వారంలో పని ప్రారంభమవుతుంది.


గర్షకుర్తిలో తయారు చేస్తున్న చీర

పనికి తగ్గ ప్రతిఫలం అందించాలి
అలువాల తిరుపతి, గర్షకుర్తి



కార్మికులు మగ్గాలే లోకంగా జీవిస్తున్నారు. స్వశక్తి చీరల తయారీలో పనికి తగ్గ ప్రతిఫలం అందించాలని కోరుతున్నారు. కాటన్, టెక్స్‌తో చీరలు తయారు చేయాల్సి ఉంటుంది. ఇది రిస్క్‌తో కూడినది. పోగులు తెగితే అతికించేందుకు ఒక్కోసారి మూడు రోజులు పట్టవచ్చు. అధికారులు కార్మికులకు పనికి తగ్గ ప్రతిఫలం అందించాలి.

స్మార్ట్ సిటీ పనుల వివరాలు అందించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్ టౌన్, జూలై 3 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో పూర్తయిన, కొనసాగుతున్న పనులపై పూర్తి వివరాలను అధికారులు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. గురువారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాయలంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో చేపట్టిన 34 ప్రాజెక్టుల పనుల వారీగా అధికారులతో చర్చించారు. పనులు పూర్తి చేసిన ప్రాజెక్టుల వివరాలతోపాటు ప్రస్తుతం అభివృద్ధి స్థాయిలో ఉన్న ప్రాజెక్టుల వివరాలను అడిగి తెలుసుకుని పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో ప్రస్తుతం కొనసాగుతున్న డిజిటల్ లైబ్రరీ భవనం, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ భవనం, బాలసదనంతో పాటు పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్తయిన ప్రాజెక్టుల పనుల్లో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఈఈలు యాదగిరి, సంజీవ్‌కుమార్, డీఈలు లచ్చిరెడ్డి, ఓంప్రకాశ్, ఆయూబ్‌ఖాన్, ఏఈలు సతీష్, గట్టు స్వామి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

కరీంనగర్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతున్నది. గురువారం స్లాట్ బుక్ చేసుకున్న 626 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ డి శోభారాణి తెలిపారు.

యూరియాను సూచించిన మోతాదులో వాడాలి..: డీఏవో భాగ్యలక్ష్మి

గన్నేరువరం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలకు తగిన మోతాదులో యూరియాను వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి జె భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పలు ఎరువుల దుకాణాలను ఏడీఏ శ్రీధర్, మండల ఏవో కిరణ్మయితో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీలను చేశారు. దుకాణాలలో ఉన్న యూరియా, డీఏపీ ఎరువుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతుందరికీ వర్షాకాలం సీజన్‌కు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచామని తెలిపారు. 12,043 మెట్రిక్ టన్నుల యూరియా, 2325 మెట్రిక్ టన్నుల డీఏపీ, 3486 మెట్రిక్ టన్నుల ఎస్‌వోపీ, 28,993 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు నిల్వ ఉన్నాయన్నారు. యూరియాను తక్కువ మోతాదులో వాడాలని, నానో యూరియా వినియోగంతో మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడాలన్నారు.


గన్నేరువరంలో సొసైటీ ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న భాగ్యలక్ష్మి

విపత్తు సమయంలో ఆపదమిత్రలు ముందుండాలి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, శిక్షణకు హాజరైన ఎన్‌సీసీ, డిగ్రీ విద్యార్థులు

కరీంనగర్ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, దుర్ఘటన సమయంలో ప్రజలను రక్షించేందుకు 'ఆపద మిత్ర' వలంటీర్లు ముందుండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రెవెన్యూ శాఖ విపత్తుల నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని 120 మంది డిగ్రీ విద్యార్థులు, ఎన్‌సీసీ వలంటీర్లకు 12 రోజులపాటు ఇవ్వనున్న ఆపదమిత్ర శిక్షణను గురువారం బీసీ స్టడీ సర్కిల్‌లో కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మొదటి విడతలో గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చిన వలంటీర్లకు ఆపద మిత్ర శిక్షణ ఇచ్చి నట్లు తెలిపారు. రెండో విడతలో డిగ్రీ కళాశాల స్థాయి, ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆపదమిత్ర శిక్షణలో భాగంగా పలు అధికారుల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, జిల్లా అగ్నిమాపక అధికారి ఎం శ్రీనివాసరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్ పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ వీడియో కాన్ఫరెన్స్‌లో..

కరీంనగర్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంపై కేంద్ర ప్రభుత్వ టీబీ విభాగం అధికారులు ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పమేలా సత్పతి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువగా 108 శాతం క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రెండో దశలో క్షయ నిర్ధారణ పరీక్షలు వేగవంతం చేశామన్నారు. ప్రతిమ వైద్య కళాశాల వారి సహకారంతో మొబైల్ ఎక్స్‌రే వాహనం ఏర్పాటు చేసి టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్

హుజూరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేసే వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్ అన్నారు. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా అయ్యేలా చూడాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువయ్యే అవకాశాలున్నాయన్నారు. వైద్య సిబ్బంది ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో పనిచేసే వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వాస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్‌ను వైద్య సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


దుర్శేడ్ శివారులో ఎస్సారెస్పీ కాలువ దుస్థితి

కాలువలు ఇలా.. సాగు నీరు ఎలా..?

కరీంనగర్ మండలంలో పంట కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. డి 88, డి 90 కాలువలకు ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో పిచ్చి చెట్లతో నిండి పోయాయి. చివరి ఆయకట్టుకు నీరు అందక ప్రతీసారి రైతులు ఇబ్బందిపడుతున్నారు. మండలంలో కాలువల ద్వారా వ్యవసాయ భూములకు నీరందుతుంది. ఆయా గ్రామాల్లో పొలాలకు నీరందించే పిల్ల కాలువలు కూడా ఆనవాళ్లు కోల్పోతున్నాయి. నగునూర్ నుంచి బొమ్మకల్ శివారు వరకు ఎస్సారెస్పీ కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.
- కరీంనగర్‌రూరల్, ఆంధ్రజ్యోతి

నుగునూర్ గ్రామ శివారులో చెట్ల పొదలతో నిండి పోయిన కాలువ ➤


దుర్శేడ్‌లో..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంగాధర, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయనకథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన వే ముల రవి(42), తన కొడుకు, తమ్ముడితో కలిసి టీఎస్ 21ఎఫ్ 0742నంబరు గల ద్విచక్రవాహనంపై గతనెల 30న కరీంనగర్ నుంచి జగిత్యాల వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని గంగాధర మండలం మధురానగర్ శివారులో కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీజీ 02టీ 1770) సైడు నుంచి ఢీకొట్టింది. దీంతో బైకు పైనున్న ముగ్గురు కిందపడగా రవికి బలమైన గాయాలతో తీవ్ర రక్తస్రావమైంది. గాయపడిన బాధితులను కరీంనగర్‌కు తరలించగా రవి చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు రవి తండ్రి వేముల లచ్చయ్య ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒంటరితనం భరించలేక బలవన్మరణం

ఇల్లంతకుంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపల్లి గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్(40) అనేవ్యక్తి ఒంటరితనం భరించలేక క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దండు శ్రీనివాస్ వివాహం అనంతరం కొద్దిరోజులకే విడాకులు తీసుకున్నాడు. గత 13 సంవత్సరాలుగా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో తన అక్క రాజవ్వ వద్ద ఉంటున్నాడు. కళ్లు సరిగా కనిపించకపోవడం, జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం తన అన్న ఉండే గాలిపల్లి గ్రామానికి వచ్చాడు. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన మహిళ

● చికిత్స పొందుతూ మృతి

ఇల్లంతకుంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏగుర్ల శైలజ(28) అనే వివాహిత చికిత్స పొందుతు మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శైలజ బుధవారం ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరుకోగా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి 17 నెలల కుమారుడు ఉన్నాడు. ఎస్సై సిరిసిల్ల అశోక్‌ను వివాహిత మృతిపై వివరణ కోరగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

ధర్మపురి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఒడ్డెరకాలనీకి చెందిన అలకొండ శ్రీవాణి(32) అనేవివాహిత బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బోయిన్‌పెల్లి మండలంలోని విలాసాగర్‌కు చెందిన శ్రీవాణికి 15ఏళ్లక్రితం ధర్మపురికిచెందిన అలకొండ సమ్మయ్యతో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొత్తలో భార్యాభర్తల మధ్య గొడవల వల్ల పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకున్నారు. ఈనెల 2న ఇంటిలో పిల్లలతో గొడవపడి శ్రీవాణి క్షణికావేశంలో తనచీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. చుట్టుపక్కల ఉన్న బంధువులు కిటికీలు పగులగొట్టి లోనికి ప్రవేశించి వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని అన్నారు. మృతురాలు శ్రీవాణి తండ్రి సంపంగి నర్సయ్య ఫిర్యాదు మేరకు శవపంచనామా జరిపి పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపించినట్లు ఆయన తెలిపారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రుద్రంగి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలకేంద్రం శివారులో గురువారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మండలకేంద్రం శివారులోని పల్లెప్రకృతి సమీపంలోని గుట్ట ప్రాంతంలో ఓచెట్టుకు ఉరివేసుకొని ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గొర్లకాపరి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికివెళ్లి పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోవడంతో తల చెట్టుకు వేలాడుతుండగా, మొండెం కిందపడి గుర్తుపట్టలేని స్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. మృతుడు ఫుల్ చేతుల షర్టు, నీలి రంగు డబ్బాల లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడు సుమారు 30రోజుల క్రితంచనిపోయి ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. గుర్తుతెలియని, అనుమా నాస్పద మృతికింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు వేర్వేరు కేసుల్లో ముగ్గురు నిందితులకు జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో గతంలో నమోదైన రెండువేర్వేరు కేసుల్లో ముగ్గురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ గురువారం కరీంనగర్ సెకండ్ అడిషనల్ జెఎంఎఫ్‌సీ కోర్టు జడ్జి జె వెంకటసత్యరాజకిరణ్ తీర్పు వెలువరించారని కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వల్లంపహడ్‌కు చెందిన ఒడ్నాల రవీందర్ కొడుకుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని 1లక్షా 20వేల రూపాయలు తీసుకుని మోసం చేసిన కేసులో నిందితులు వొడ్నాల శ్రీనివాస్, కరీంనగర్‌కు చెందిన పెంచాల మాధవ్‌లకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల రూపాయల జరిమానాను కోర్టు విధించిందని సీఐ తెలిపారు. అదే విధంగా కరీంనగర్ రూరల్ మండల పరిధిలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతికి కారణమైన లారీడ్రైవర్ మానకొండూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన మాదాసు తిరుపతికి కోర్టు ఏడాది జైలుశిక్ష, వెయ్యిరూపాయల జరిమానా విధించిందని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ నేరాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేయడమే కాకుండా, వారికి తగిన శిక్షలు పడే విధంగా సాక్షులను కోర్టులో ప్రవేశపెడుతున్నా మని అన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

రాయికల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం కట్కాపూర్-తాట్లవాయి గ్రామాల మధ్య గురువారం ఆర్టీసీబస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ప్రయాణికులకు ఎలాంటిగాయాలు కాకపో వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జగిత్యాల నుంచి దావన్‌పెల్లి వెళ్తున్న ఆర్టీసీబస్సు గురువారం సాయంత్రం దావన్‌పెల్లినుంచి తాట్ల వాయికి వస్తుండగా అదుపుతప్పి రోడ్డుకు పక్కకు దూసుకెళ్లింది. వర్షాల వల్ల రోడ్డు పూర్తిగా చెడిపోవడంతో బస్సు అదుపు తప్పిందని డ్రైవర్ తెలిపాడు.



మోతాదు మించితే ప్రమాదమే..

యూరియా వినియోగంపై అవగాహన సదస్సులు

రైతులను చైతన్యపరుస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కోరుట్ల రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సాగులో మోతాదును మించి యూరియాను వినియోగిస్తే జరిగే నష్టాన్ని అన్నదాతలకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ ప్రాంతీయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో ప్రతీ గ్రామంలో రైతులకు సాగులో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పిస్తూ చైతన్యం నింపుతున్నారు. ఏ పంటకు ఎప్పుడెప్పుడు ఎంత యూరియా వాడాలనే అంశాలపై రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహిస్తు న్నారు. వివిధ క్లస్టర్లలో నమోదైన రైతు ఫోన్ నంబ ర్లకు మెస్సేజ్‌లు వచ్చేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వరికి యూరియా వాడే విధానం..

వరి పంటకు మూడు దశల్లో యూరియా వాడాలి. నాటిన సమయంలో లేదా 20 రోజుల తరువాత ఎకరానికి 30 కిలోల యూరియా వేయాలని శాస్త్రవే త్తలు సూచిస్తున్నారు. రెండో దఫా 35 రోజుల నుంచి 40 రోజుల మధ్య 30 కిలోలు వాడాలి. మూడో వంతు యూరియా 55 నుంచి 60 రోజులకు గుత్తి ఏర్పడే దశలో 30కిలోలు వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

మొక్కజొన్న పంటకు...

ఎకరానికి 90 కిలోల నుంచి 100 కిలోలు వివిధ దశల్లో వేయాలి. విత్తే సమయంలో 20 కిలోల యూరియా, 25 రోజుల నుంచి 30 రోజుల వద్ద ఎదుగుదల దశలో 40 కిలోలు వాడాలి. 45 రోజుల నుంచి 50 రోజుల వద్ద పుప్ప దశలో 40 కిలోల యూరియాను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

పసుపు పంటకు...

ఎకరానికి 60 కిలోలు వాడాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మొలక వచ్చిన 30 రోజల తర్వాత మొదటి మోతాదు 30 కిలోలు, 60 నుంచి 75 రోజల సమయంలో రెండో విడత 30 కిలోల వాడాలని సూచి స్తున్నారు. ఎక్కువ నత్రజనక వాడకం వలన ఆకుల అభివృద్ధి ఎక్కు వై వేర్ల అభి వృద్ధి తక్కువ అవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరి స్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

నాగమణి, మండల వ్యవసాయ అధికారి, కోరుట్ల



యూరియా వినియోగంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. అన్ని పంటల సాగుపై అవగాహన ఉండే విధంగా వ్యవసాయ శాస్త్రవేతలతో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ అన్నదాతల్లో చైతన్యం నింపుతున్నారు. ప్రతి రైతుకు సాగులో మెళకువలు వివరిస్తున్నాం.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

షమీనా, ఏఈవో




సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తున్నాం. అంతర్ పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. రైతులు శాస్త్ర వేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలి.



ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 8,718 క్యూసెక్కుల నీరు రాక



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డ్యామ్

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు పెరుగుతోంది. డ్యామ్‌లోకి 8,718 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 17.103 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 11.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 635 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.080 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 1.765 టీఎంసీల నీటిని వ్యయం చేశారు.

త్వరలో రాజన్న ఆలయ విస్తరణ పనులు

● గోశాల నిర్మాణానికి 40 ఎకరాల స్థల సేకరణ ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయవిస్తరణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. తుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామితో కలిసి ఆయన రాజరాజేశ్వరస్వామిని గురువారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయట్రస్ట్ ఆధ్వర్యంలో పార్వతి రాజరాజేశ్వర అఖిలభారత వేదశాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సును ప్రారంభించారు. సదస్సులో భాగంగా వేదపండితులకు చతుర్వేద స్మార్త పరీక్షలు నిర్వహించి వారికి పట్టాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో తిరుమల తిరుపతిలో నిర్వహించే పరీక్షలు ఇప్పుడు రాజన్న సన్నిధిలో నిర్వహించడం ఈ ప్రాంతవాసుల అదృష్టమన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షలు ఇక్కడ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇంతటి కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖకు ధన్యావాదాలు తెలుపుతున్నావున్నారు. భారతదేశం సంప్రదాయాలకు ప్రతీక అని, నాలుగు వేదాలు చదివే పాఠశాల కేవలం వేములవాడలోనే ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి మరింత ప్రచారం లభిస్తుందన్నారు. రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సువిశాలమైన గోశాల నిర్మాణానికి 40 ఎకరాల స్థలసేకరణ చేశామన్నారు. గత అసెంబ్లీ సమావేశాలలోనే వేములవాడలో వేద యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరామన్నారు. తుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ రాజరాజేశ్వరస్వామి ఆలయం ప్రముఖపుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోందన్నారు. పలుమార్లు స్వామివారి దర్శనం చేసుకున్నామన్నారు. ప్రభుత్వం తలపెట్టిన ఆలయ అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగాలన్నారు. ఆలయ ఈవో రాధాబాయి, ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న తుని పీఠాధిపతి, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వైభవంగా జగన్నాథ రథయాత్ర



రాయికల్‌లో రథయాత్రలో పాల్గొన్న భక్తులు

రాయికల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో గురువారం జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది. మెట్‌పల్లిలోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్ర పట్టణంలోని బస్టాండ్ నుంచి ప్రారంభమై గాంధీ చౌక్, పటేల్ విగ్రహం మీదుగా మార్కండేయ దేవాలయ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రథయాత్రలోపాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



ఇబ్రహీంపట్నంలో సహకార సంఘం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం వద్ద గురువారం యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. కొంతమందికే యూరియా ఇచ్చి స్టాక్ అయిపోయిందని సిబ్బంది చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించినా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరుగా ఉందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సరిపడా యూరియా తెప్పించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని రైతులు విమర్శించారు. ఈ విషయమై ప్రాథమిక సహకార సంఘం సీఈవోను వివరణ కోరగా కేంద్రానికి 450 సంచుల యూరియా వచ్చిందని, ఒక్కొక్క రైతుకు మూడు సంచుల చొప్పున ఇచ్చామన్నారు. రెండు రోజుల్లో రైతులకు సరిపడా యూరియా తెప్పిస్తున్నట్టు సీఈవో తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



యజమానికి సెల్‌ఫోన్ అందజేస్తున్న కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ పోలీసులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశారు. సప్తగిరికాలనీకి చెందిన అబ్దుల్‌రెహమాన్ తన స్మార్ట్‌ఫోన్‌ను 2024సెప్టెంబరు2న కరీంనగర్‌రూరల్ మండలం నగునూరు గ్రామంలో పోగొట్టుకున్నాడు. వెంటనే ఆయన రూరల్‌పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన రూరల్‌పోలీసులు, సీఈఐఆర్ టెక్నాలజీని ఉపయోగించి ఫోన్‌ఆచూకీ గుర్తించారు. పోగొట్టుకున్నఫోన్ కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. ఆ సెల్‌ఫోన్‌ను ఇప్పటివరకు ఉపయోగించిన వ్యక్తి ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న అబ్దుల్ రెహమాన్‌ను కరీంనగర్‌రూరల్ పోలీసుఠాణాకు పిలిపించారు. రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను తిరిగి అతడికి అప్పగించారు. ఫోన్‌ను ట్రేస్ చేయడంలో కృషిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

వీణవంక, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో గురువారం గ్రామస్థులు ఇసుకలారీలను అడ్డుకున్నారు. దాదాపు ఆరుగంటలపాటు లారీలను నిలిపివేశారు. కొండపాక గ్రామంలోని మానేరువాగు క్వారీలో తమ గ్రామస్థులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వారంక్రితం ధర్నా చేసిన గ్రామ స్థులను అధికారులు క్వారీ యాజమానులతో మాట్లాడి ఉపాధి కల్పిస్తామని తెలిపారని అన్నారు. అయితే ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఉపాధి కల్పించలేదని అన్నారు. ఆరు గంటలపాటు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు.



హిమ్మత్‌నగర్‌లో ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

మళ్లీ మొదలవనున్న కల్వర్టు కష్టాలు

● హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజల డిమాండ్

గన్నేరువరం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలవడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న లోలెవల్ కల్వర్టులతో ఈ ఏడాది కూడా కష్టాలు తప్పేలా లేవు. మండల కేంద్రంలోని చెరువువద్ద ఉన్న లోలెవల్ కల్వర్టు రెండువైపులా కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. వర్షాలు బాగా కురిసి చెరువు నిండి కల్వర్టుపై నీరు ప్రవహిస్తే కల్వర్టు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ప్రతి వర్షాకాలం మండలంలోని జంగపల్లి నుంచి హన్మాజిపల్లి ఎక్స్‌రోడ్డు మధ్యలో ఉన్న లోలెవల్ కల్వర్టు, అలాగే పారువెల్ల నుంచి ఖాసింపేట గ్రామాల మధ్యన ఉన్న కల్వర్టు, గన్నేరువరం చెరువు వద్ద ఉన్నకల్వర్టువద్ద నీటి ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇటీవల గుండ్లపల్లి నుంచి గునుకుల కొండాపూర్ వరకు నిర్మించిన డబుల్ రోడ్డులో సైతం గునుకుల కొండాపూర్‌వద్ద కల్వర్టు నిర్మించకుండానే మట్టినిపోసి వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షాలకే మట్టి రోడ్డుకు గండిపడుతోంది. భారీవర్షాలు కురిస్తే రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నది. ప్రతియేడు ఆయాకల్వర్టులు దాటడా నికి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆయా కల్వర్టుల వద్ద హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించి సమస్యలను తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గన్నేరువరం చెరువు వద్ద ప్రమాదకరంగా రెండు వైపులా కుంగిన లోలెవల్ కల్వర్టు



గునుకుల కొండాపూర్ వద్ద వరద నీటితో గండికొట్టిన మట్టి రోడ్డు

రేపు ఉమ్మడి జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

మార్కండేయకాలనీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు అర్హులైన అభ్యర్థులకు ఈనెల 5న గోదా వరిఖని సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పోటీలు నిర్వ హించనున్నట్టు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, ఫుట్‌బాల్ కిట్‌తో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల9న మంచి ర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు జనవరి 1, 2009 నుంచి డిసెంబర్ 31,2011మధ్య జన్మించిన వారు అర్హులని, ఇతర వివరాలకు 9550903088, 9908839896 నంబర్లో సంప్రదించాలని కోరారు.

60 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

● గొల్లపల్లిలో టాస్క్‌ఫోర్సు పోలీసుల దాడులు

● రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠినచర్యలు తప్పవని టాస్క్‌ఫోర్సు సీఐ నటేశ్ హెచ్చరించారు. ఎస్పీ మహేశ్ బీ గితే ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో బుధవారం స్థానిక పోలీసులతో కలిసి ఆయన మెరుపు దాడులు నిర్వహించారు. గ్రామంలోని బీనవేని దేవయ్య ఇంటిలో అక్రమంగా నిల్వచేసిన 60 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. దేవయ్య తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర పట్టణాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడని గుర్తించారు. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమ రవాణాచేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. పేదల బియ్యంపై నిరంతరం నిఘాను తీవ్రతరం చేసి దాడులు నిర్వహించి అడ్డుకట్ట వేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం అమ్మిన, కొనుగోలు చేసిన తమకు ప్రజలు సమాచారం అందించాలని టాస్క్‌ఫోర్సు సీఐ నటేశ్ కోరారు. కేసు నమోదు చేశామని స్థానిక పోలీసులు వివరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్సు సిబ్బంది తిరుపతి, రాజేశ్, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనపర్చుకున్న బియ్యం









WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111





నిరుపయోగం

వీణవంక, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి ముళ్లపొదలతో నిండిపోయాయి. కొర్కల్‌లోని క్రీడాప్రాంగణం పూర్తి స్థాయిలో తీర్చిదిద్దకపోవడంతో కేవలం బోర్డు వరకే పరిమితమైంది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాముఖ్యం ఇస్తుండటంతో గ్రామీణ క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయాలని గ్రామ యూత్ నాయకుడు మంద అనిల్‌రెడ్డి కోరారు.



మంచినీటి పైపు లీకేజీ

మానకొండూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని పల్లె మీద బస్టాండ్ వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయింది. నీరంతా రోడ్డు వెంబడి ప్రవహించడంతో రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. జమ్మికుంట వైపు బస్సు ఎక్కేందుకు వేచి ఉన్న ప్రయాణికులు నిలబడలేకపోతున్నారు. అధికారులు స్పందించి లీకేజీలను మరమ్మతు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిండిన డ్రైనేజీ

మానకొండూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదులగట్టిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న మురికి కాల్వలో నీరు నిలిచిపోవడంతో దుర్వాజన వెదజల్లుతోంది. దీంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. దుర్వాసనకు భరించలేకపోతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రాముని వివరణ కోరగా మురికికాల్వ చివరన ఉన్న రైతులు పొలాల్లోకి నీరు రావద్దని అడ్డుకుంటున్నారన్నారు.



ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

డాక్టర్ శ్రీకీర్తన, చొప్పదండి పీహెచ్‌సీ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ట్యాంకుల్లో, కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి.

ప్రశ్న: ఎటువంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

డాక్టర్: డెంగీ, మలేరియా, జలుబు, జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది.

ప్రశ్న: వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డాక్టర్: గ్రామాల్లో తమ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పరిశుభ్రత, నీరు నిల్వ లేకుండా చూస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం.

- చొప్పదండి, ఆంధ్రజ్యోతి

● సంక్షిప్తంగా..

భగత్‌నగర్ : కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రాచమల్ల కరుణాకర్ పాల్గొన్నారు.

చొప్పదండి: విద్యారంగంపై సర్కార్ చిన్నచూపు చూస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మచ్చ రమేశ్ అన్నారు. గురువారం చొప్పదండిలో సమావేశంలో మాట్లాడారు.

● చొప్పదండి మండలంలోని భూపాలపట్నం గ్రామంలో కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై రైతులకు అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట ఎస్సైగా క్రాంతి కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు గురువారం ఆర్డీవో రమేష్‌బాబు ఓటర్ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

కరీంనగర్ రూరల్: లయన్ ఇంటర్నేషనల్ 320జి ఏర్పడి 10వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానేరు క్లబ్ ప్రెసిడెంట్ ముత్యం శంకర్‌గౌడ్, క్లబ్ సెక్రెటరీ కృష్ణ, పాస్ట్ జెసీ వేముల విష్ణు మూర్తి, పడమటింటి రమేష్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి మాజీసర్పంచ్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ చిట్టింపల్లి సత్య నారాయణ గురువారం గుండెపోటుతో వరంగల్‌లోని ఓ హాస్పిటల్‌లో మృతిచెందారు.

కరీంనగర్ టౌన్ : కరీంనగర్ పట్టణంలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమెన్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ వారి సహకారంతో పేద విద్యార్థినిలకు గురువారం సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుడబ్ల్యుఎస్ వ్యవస్థాపకులు జమునా ప్రవీణ్ పాల్గొన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన చల్ల హరిశంకర్‌ను గురువారం జ్యోతిబాపూలే సర్కస్ గ్రౌండ్‌లో లెజెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట పరిధిలోని కొల్లూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం-1లో వాటర్‌క్యాన్, పలకలు అందజేశారు.

గన్నేరువరం: లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నేరువరం ఆధ్వర్యంలో బెజ్జంకి లయన్ ఎలుక రాజేంద్రప్రసాద్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నోట్‌బుక్‌లను అందించారు.

రామడుగు : మండల కేంద్రంలోని శ్రీ మడేలేశ్వర స్వామి దేవాలయానికి పెయింటింగ్ ఖర్చుల నిమిత్తం మేడిపల్లి రూపాదేవి ఫౌండేషన్ ద్వారా 10వేల రూపాయలను గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి అందజేశారు.

భగత్‌నగర్: రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని శ్రీ సచ్చిదానంద ఆశ్రమం, రామాలయంలో మొక్కలు నాటారు.

పప్పుదినుసుల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

గన్నేరువరం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నందున రైతులందరూ పప్పుదినుసు పంటల సాగుపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంది సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలను సరఫరా చేస్తున్నదన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 47మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏ శ్రీధర్, ఏవో కిరణ్మయి, ఏఈవో ప్రశాంత్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పులి కృష్ణ, రైతులు పాల్గొన్నారు.



గన్నేరువరంలో కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

పేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం పనిచేస్తోంది

శంకరపట్నం: పేద ప్రజల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం శంకరపట్నం మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకే ఇళ్లు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలో పార్టీలకతీతంగా అర్హులైన 500మందికిపైగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, తహసీల్దార్ సురేఖ, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య తదితరులు పాల్గొన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో నూతనంగా నిర్మించ బోయే ముఖద్వారానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ ముఖ ద్వారా నిర్మాణ దాతలు తాండ్ర నిర్మల, శంకర్‌బాబును ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు.

స్మార్ట్ సిటీ అవకతవకలపై విచారణ జరిపించాలి

కరీంనగర్ అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): గత పాలకులు నగరంలో స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారని విచారణ జరిపించాలని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ పార్టీ స్మార్ట్‌సిటీ పనులు, కూడళ్ల సుందరీకరణ పనులలో నాణ్యత లోపిస్తుందని నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, చర్ల పద్మ, కట్ల సతీష్, దన్నాసింగ్, ఖంరోద్దీన్, షబానా మహ్మద్, జ్యోతి రెడ్డి, ముల్కల కవిత, తిరుమల, హసీనా ఉన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

ఖర్గే సభకు కలిసికట్టుగా తరలివెళదాం

కరీంనగర్ అర్బన్ : హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహిస్తున్న బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే హాజరుకానున్నారని, ఈ సభకు కలిసికట్టుగా భారీగా తరలివెళదామని సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు.

రేపు జగన్నాథ రథయాత్ర

కరీంనగర్ కల్చరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లో 4వ పర్యాయం శనివారం జగన్నాథ రథయాత్ర జరుగనుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు రాంనగర్ రమాసత్యనారాయణస్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభమై మంకమ్మతోట, తెలంగాణచౌక్, బస్టాండ్, కమాన్, శాస్త్రిరోడ్, టవర్‌సర్కిల్ మీదుగా వైశ్యభవన్ చేరనుంది. అక్కడ ప్రవచనం, నైవేద్య సమర్పణ, వితరణ ఉంటుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంఎల్‌ఏ గంగుల కమలాకర్, కలెక్టర్ పమేలాసత్పతి, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సీపీ గౌస్ ఆలం, అర్చకులు, పురోహితులు, నగర ప్రజలు పాల్గొననున్నారు. ప్రజలు కుటుంబ సభ్యులతో పెద్ద సంఖ్యలో యాత్రకు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు : సీపీ

కరీంనగర్ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను, డీజేలు, డ్రోన్‌లపై ఉన్న నిషేదాజ్ఞలను పొడిగించామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈచర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ నిషేదాజ్ఞలు ఈ నెల 31 వరకు కొనసాగుతాయని తెలిపారు. నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై చర్యలు..

కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్‌కమిషనర్ కమిషనర్ గౌస్‌ఆలం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీల అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదని, ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, యారణాయుధాలను ధరించి సంచరించరాదని అన్నారు. ఈ ఉత్తర్వులు ఈనెల 31వరకు అమలులో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై ఐపీసీ సెక్షన్ 188 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

హుజూరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 29మంది లబ్ధిదారులకు రూ. 8.35లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ శ్రీనివాస్, గందె శ్రీనివాస్, ముత్యం రాజు, తిరుమల్‌రెడ్డి, యాదగిరి, కుమార్, నరేష్, అనిల్, పూర్ణచందర్, కుమారస్వామి, శ్రీనివాస్, ఇమ్రాన్, రమా, కిషన్, కృష్ణ పాల్గొన్నారు.

దుర్గాభవానీ అమ్మవారికి కాకరకాయ మాలల అలంకరణ

కరీంనగర్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీ దుర్గా భవానీ ఆలయంలో జరుగుతున్న ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాలలో భాగంగా గురువారం శ్రీ దుర్గాభవానీ అమ్మవారిని కాకరకాయ మాలలతో అలంకరించారు. ఆలయ ఫౌండర్, ఛైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత

శంకరపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగట్టు ఆలయ ఛైర్మన్ కోరెం రాజిరెడ్డి, నాయకులు ఉప్పుగళ్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్స్‌ను సాధించిన నలుగురు విద్యార్థులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం అభినందించారు. చొప్పదండికి చెందిన ఇద్దరు ఆర్నకొండ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శాలువాతో సత్కరించారు. భవిష్యత్తు మరిన్ని విజయాలు సాధించాలని అభినందించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు

కరీంనగర్ లీగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(సైన్స్ వింగ్)లో ర్యాగింగ్‌పై న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వి గంగాధర్, జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కమిటీ సభ్యులు ఎ కిరణ్ కుమార్, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ సమీరా పర్వత్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సెక్రటేరియట్ ముట్టడి

గణేశ్‌నగర్,జూలై 3(ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్, నిరు ద్యోగ భృతి, రాజీవ్ యువ వికాస్ పథకాలతో పాటు తక్షణ మే ఉద్యోగ నోటిఫికేషన్ వేయాలని శుక్రవారం సెక్రటేరియట్ ముట్టడిని విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అభిలాష్ రాజేష్ నితీష్ పాల్గొన్నారు.

పట్టాభిరామ్‌కు ఘన నివాళి

కరీంనగర్ కల్చరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్‌కు గురువారం కళాభారతి ఆవరణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు మల్లేశం, యతిరాజ్, సభ్యులు మేజిక్ రాజా, జక్కని రాజు, మేజిక్ హరి, గుర్రం శ్రీనివాస్, కెఎస్ చారి, జితేందర్, కాంతారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిలు ఆత్మరక్షణలో మెలకువలు నేర్చుకోవాలి

భగత్‌నగర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిలు ఆత్మరక్షణ మెలకువలు నేర్చుకోవాలని విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల లియో విద్యార్థినిల సెల్ఫ్ డిఫెన్స్ కార్యశాలను ప్రారంభించారు. అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్నపుడు తమనుతాము రక్షించుకునేలా శిక్షణ పొందాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల కృష్ణ గోపాల్, డా ఎస్ మనోహరాచారి పాల్గొన్నారు.



విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినిలు

అధికారుల తనిఖీలు

హుజూరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో జీరో వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణల మేరకు కమర్షియల్ ట్యాక్స్ అధికారులు గురువారం పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు.

ప్రభుత్వ మెడికల్ విద్యార్థుల సమస్యలు పరిష్కారం

కరీంనగర్ అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో పరిష్కారమయ్యాయని ఆర్టీఏ మెంబర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పడాల రాహుల్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానంగా హాస్టల్ మెస్ కాంట్రాక్టర్‌ను మార్చాలని, కళాశాల విద్యార్థుల కోసం రిక్వెస్ట్‌బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని, అధిక వేగంతో వెళుతున్న వాహనాల రాకపోకల నియంత్రణ కోసం బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల నుంచి వచ్చిన వినతుల మేరకు తక్షణమే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రారంభించారన్నారు. ఆర్టీసీ ఆర్ఎంతో మాట్లాడి కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ని కోరినట్లు తెలిపారు.

పోయిన ఫోన్‌ను పట్టేద్దాం..

(5వ పేజీ తరువాయి)

ఇన్‌వాయిస్ బిల్లు ద్వారా కూడా ఐఎంఈఐ నంబర్‌ను పొందవచ్చు.

● స్టేషన్ల వారీగా గుర్తించిన ఫోన్లు

కమిషనరేట్ వ్యాప్తంగా 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రజలు పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన 1,627 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. పోలీసు ఠాణాలవారీగా సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించారు. కరీంనగర్ రూరల్- 275, కరీంనగర్ సీసీఎస్-37, కరీంనగర్ వన్‌టౌన్-373, కరీంనగర్ టూటౌన్-234, కరీంనగర్ త్రీటౌన్-105, హుజూరాబాద్ టౌన్-75, చిగురుమామిడి-17, శంకరపట్నం-47, చొప్పదండి-39, ఇల్లందకుంట-23, గంగాధర-26, సైదాపూర్-24, గన్నేరువరం-21, జమ్మికుంట-73, కొత్తపల్లి-56, ఎల్ఎండీ కాలనీ-64, మానకొండూర్-87, రామడుగు-10, వీణవంక పోలీస్ స్టేషన్‌లో 41 సెల్‌ఫోన్‌లు వెదికిపట్టుకుని ఫిర్యాదుదారులకు అప్పగించారు.

డంపు యార్డు సమస్యను పరిష్కరించండి

కరీంనగర్ అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బైపాస్ రోడ్‌లో ఉన్న డంపు యార్డు సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, ఐదు డివిజన్లకు సంబంధించిన ప్రజలు డంపు యార్డు ద్వారా వస్తున్న దుర్వాసనతో అనేక వ్యాధుల బారిన పడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మాజీ కార్పొరేటర్లతో కలిసి ఆయన గురువారం కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. తీగలగుట్టపల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. తొలగించిన మున్సిపల్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున రాజేందర్, ఆర్ష మల్లేశం, వైద్యుల అంజన్ కుమార్, ఆకుల నరసన్న, భూమాగౌడ్, కట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రిప్స్ హక్కులను కాపాడాలి

సుభాష్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మెడికల్ రిప్రజెంటేటివ్స్ హక్కులను కాపాడాలని భారతీయ మెడికల్ అండ్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పప్పుల సురేష్ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ద్వారా కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో క్యాతం శ్రీనివాస్, మాదాసు విక్రమ్ పాల్గొన్నారు.

ఎస్సీ కళాశాల వసతి గృహంలో 170 సీట్లు ఖాళీ

హుజూరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ కళాశాల వసతిగృహంలో 170సీట్లుఖాళీగా ఉన్నాయని వసతిగృహం సంక్షేమాధికారి కొలిపాకసుమన్ గురువారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వఎస్సీకళాశాల వసతిగృహంలో 200సీట్లకు 30సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయన్నారు. మిగితా170సీట్లలో ఎస్సీ విద్యార్థులకు138,ఎస్టీ విద్యార్థులకు9, బీసీవిద్యార్థులకు20, ఓసీవిద్యార్థులకు 3సీట్లు కేటాయించామన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు9603880421నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలి

హుజూరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రైవేట్‌పాఠశాలలు, కళాశాలల బస్సులను తనిఖీచేసి, ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్‌చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంవీఐ కంచె వేణుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, రాజేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

ఇల్లందకుంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ముందే పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటిని విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లాఅధ్యక్షుడు ఆవాల నరహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జమ్మికుంటజోన్ కన్వీనర్ శ్రీనివాస్,మండలాధ్యక్షుడుసంపత్,వేణు,సదానందం,తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేయకుండా చర్యలు తీసుకోండి

గణేశ్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బైపాస్ రోడ్ బొమ్మకల్ కృష్ణానగర్ ప్రాంతంలో నగరపాలక సంస్థ ట్రాక్టర్లు ఇళ్ల మధ్యనే చెత్త వేస్తూ మరోడంపింగ్ యార్డ్‌లా తయారుచేస్తున్నారని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరకొండ అజయ్ అన్నారు. చెత్తవేయకుండా చర్యలు చేపట్టాలని గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

భగత్‌నగర్, జులై 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి హవేలిలోని రామాలయం దేవాలయం పరిధిలోని నాలుగుఎకరాల భూమిని పేదలకు పంచాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లాఅధ్యక్షకార్యదర్శులు కవ్వంపల్లి అజయ్, వడ్లరాజు డిమాండ్ చేశారు. గురువారందేవాలయ ఆవరణలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు.

హమాలి వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం

భగత్‌నగర్, జులై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా హమాలి వర్కర్స్ యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశం గురువారంనగరంలో జరిగింది. సమావేశంలో హమాలిసంఘం అధ్యక్షుడు సీహెచ్ సంపత్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ఈనెల9న జరిగే దేశవ్యాప్తసమ్మెలో అన్ని రైస్‌మిల్ హమాలికార్మికులు పాల్గొనిసమ్మె జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు.

ఏవోకు ఏడీఏగా పదోన్నతి

చిగురుమామిడి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజులనాయుడుకు ఏడీఏగా పదోన్నతి వచ్చింది. పదోన్నతిపై వెళుతున్న ఆయనను అధికారులు, రైతులు అభినందించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

చొప్పదండి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు గురువారం మొక్కలు నాటారు. గైడ్‌టీచర్ కర్ర వెంకటరాంరెడ్డి చెట్ల పెంపకంపై అవగాహన కల్పించారు.

బీజేపీ సీనియర్ నాయకుడు హరికుమార్‌గౌడ్ మృతి



హరికుమార్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్



హరికుమార్‌గౌడ్ (ఫైల్)

భగత్‌నగర్/గణేష్‌నగర్, జులై 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు, బీజేపీ మాజీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు తాళ్లపల్లి హరికుమార్‌గౌడ్ గురువారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. భారతీయ జనతాపార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన కరీనగర్‌లో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. హరికుమార్‌గౌడ్ కుటుంబాన్ని గురువారం రాత్రి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. హరికుమార్‌గౌడ్ మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు.

● బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి బీజేపీ నాయకులు, కార్యకర్తలు హరికుమార్‌గౌడ్ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.